క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు బాగస్వాములు కావాలని డాక్టర్ భాస్కర్‌నాయుడు అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో సోమవారం వైస్ ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షతన 'సహజ పర్యావరణం కాపాడుకుందాం' కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పర్యావరణంను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అడవులను పరిరక్షించుకోవాలన్నారు. అడవులను నరికి వేయటం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం మానుకోవటంతో పాటు మొక్కలు పెంచటం అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

సర్వీసు రోడ్డు పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. మధురాగర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించారు. ఇక్కడ ఆర్‌యూబీ వినియోగంలోకి వచ్చి ఏడాది దాటినా సర్వీసు రోడ్డు పనులు పూర్తిచేయలేదు. దీంతో ఇక్కడ చిన్నపాటి వర్షానికే రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవటం రోడ్డు బురదమయంగా మారటంతో పాటు కంకర లేచిపోయి ప్రమాదకరంగా మారుతుండేది. స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సర్వీసు రోడ్డు పనులు చేపట్టారు.

గాయకుల ప్రతిభను గుర్తించాలి

విజయవాడ కల్చరల్: గాయకులలోని ప్రతిభను గుర్తించాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సోమవారం సినీ సంగీత విభావరి, గాయనీ సాహితీవేత్త నాగే శ్వరమ్మకు ఉగాది పురస్కారం అందకున్నందుకు అభినందన సత్కారం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కవి సామ్రాట్ విశ్వనాథ పేరుతో పురస్కారం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, బోడి ఆంజనేయరాజు వివిధ సంస్థల ప్రతినిధులు కే డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు,శింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం, అష్టబంధన, మహాసంప్రోక్షణ మహోత్సవాలు ఘనంగా సాగాగుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో టీటీడీ కంకణ భట్టార్, అర్చకులు వేదాంతం శశిధరాచార్యులు పర్యవేక్షణలో సర్వశాంతిహోమం, సహస్రాహూతి హోమం నిర్వహించారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంపుల్ ఇనస్పెక్టర్ లలితా రమాదేవి, డెప్యూటీ ఏఈ నాగభూషణం, సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జునరావులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంభాభిషేక మహోత్సవాలను తిలకించారు.

పంచ జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఐదు జ్యోతిర్లింగాలను దర్శనంతో పాటు భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యాత్ర పేరుతో భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలును సికింద్రబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ప్రారంభించారు. ఆగస్టు 16 నుంచి 24వ తేదీ వరకు ఎనిమిది రాత్రుళ్లు, తొమ్మిది పగలు సాగే ఈ యాత్రలో నాగ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన ప్రదేశమైన దీక్షా భూమి, శ్రీ స్వామి నారాయణ మందిరం దర్శనం, ఉజ్జెయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ జన్మస్థలం భీమ్ జన్మభూమి, నాసిక్‌లోని త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగ దర్శనం కల్పించారు. ఈ ప్యాకేజీలో స్లీపర్ క్లాస్‌లో ఒక్కొక్కరికి పెద్దలకు రూ. 14,700, పిల్లలకు రూ.13,700, 3 ఏసీ క్లాస్‌లో పెద్దలకు 22,900, పిల్లలకు రూ.21,700, 2 ఏసీలో పెద్దలకు రూ.29,900, పిల్లలకు రూ. 28,400 ధర నిర్ణయించారు. ఆసక్తి కలిగిన యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా విజయవాడలోని కార్యాలయం లేదా 92814 95848 ద్వారా టికెట్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు.

సమస్యల వలయంలో అమరావతి కాలనీ

- అడుగడుగునా యూజీడీ లీకులు.. తాగునీరు 'మురుగు' కంపు
- భయపెడుతున్న 'పందులు'.. కునుకు తీయనివ్వని దోమలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అడుగడుగునా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లీకులు.. తాగునీటి కొళాయిల నుంచి 'మురుగు' దుర్వాసనలు.. ఏ వీధి చూసినా గుంపులుగా 'పందులు', 'వీధికుక్కలు' కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న 'దోమలు'.. ఇదేదో మారుమూల గ్రామం గురించి చెబుతున్న విషయాలు కాదు.. మన నగరంలోని స్థానిక 57వ డివిజన్ అమరావతి కాలనీలో పాతుకుపోయిన సమస్యల చిట్టా.

పొంగిపొర్లుతున్న 'డ్రెయినేజీ' మ్యాన్‌హోల్స్

అమరావతికాలనీలోని ప్రధాన లైన్లలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లీకులు అధికంగా ఉన్నాయి. యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి డ్రెయినేజీ నీరు పొంగి రోడ్లు, నివాసాల ముందుకు చేరుతుంది. దీంతో రోడ్లపై నడవాలన్నా.. ఇళ్లల్లో ఉండాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తూతూమంత్రంగా చర్యలు తీసుకుని వదిలేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారమార్గం చూపడం లేదనే విమర్శలున్నాయి.

మంచినీటి కుళాయిల్లో దుర్వాసనతో కూడిన మురుగునీరు

ఈ కాలనీల్లో అడుగడుగునా యూజీడీ లీకులు ఉన్నాయి. వీటిలో కొన్ని చోట్ల తాగునీటి పైపులు కూడా కలుస్తున్న నేపథ్యంలో అమరావతి కాలనీకి కుళాయిల్లో నుంచి వచ్చే తాగునీరు కూడా దుర్వాసన వస్తోంది. ఒక్కోసారి మురుగు నీరు కూడా వస్తోంది. కార్పొరేషన్ వాటర్ సప్లై సిబ్బందికి పలుమార్లు తాము ఫిర్యాదు చేసినా ఎవరూ సరిగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అయినా సమస్యలకు పరిష్కారమార్గాలు చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



క్లిష్ట గణపతి దేవస్థానం వద్ద యూజీడీ నుంచి లీకై రోడ్లపై చేరిన మురుగు నీరు

దోమల మందు పిచికారీ చేయడం లేదు

బుడమేరు ప్రాంతానికి ఆనుకుని ఉన్న కాలనీ కావడంతో తమకు దోమల సమస్య విపరీతంగా ఉంటుందని, దోమల పొగ, మందు సరిగా పిరిచారీ చేయకపోవడం వల్ల దోమలు బెడద అధికంగా ఉండడంతో కంటిమీద సరిగా కునుకు ఉండడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

పందుల సైర్వవిహారం

పందుల పెంపకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందని అమరావతి కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కలు, పందుల సమస్యలు అన్ని వీధుల్లో ఉన్నాయని, కార్పొరేషన్ అధికారులకు, సిబ్బందికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తమ ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి కాలనీతో పాటు డివిజన్‌లోని చుట్టుపక్కల ప్రాంతాలైన జామతోట, సుందరమ్మ దిబ్బ, న్యూఆర్ఆర్‌పేట పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి తమను సమస్యల నుంచి విముక్తి కలిగించాలని ప్రాథేయపడుతున్నారు.





కాలనీలో సంచరిస్తున్న పందులు

ఇబ్బందులు పడుతున్నాం



అమరావతి కాలనీ సమస్యలకు నిలయంగా మారినట్లు ఉంది. ప్రధానంగా యూజీడీ లీకులు, పందులు, దోమల సమస్యల అత్యధికంగా ఉన్నాయి. సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా సరిగా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

– టి.తిరుపతయ్య, అమరావతి కాలనీ

తాగునీరు కలుషితమవుతోంది



యూజీడీ లీకులతో అక్కడక్కడా మంచినీటి పైపులు పగిలిపోయి వాటిల్లో కలిసిపోయాయి. వీటి వల్ల కుళాయిల్లో వచ్చే నీరంతా మురుగుగా రావడంతోపాటు తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలమందు పిచికారీ సరిగా చేయడం లేదు. ప్రభుత్వ పెద్దలు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు మా కాలనీపై ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యల వలయం నుంచి మాకు శాశ్వత విముక్తి కలిగేలా చూడాలని కోరుతున్నాం.

– డీవీ సుబ్రహ్మణ్యం, అమరావతి కాలనీ ప్రెసిడెంట్

నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్, నగరపాలక సంస్థ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షతన సోమవారం స్థాయీ సంఘ సాధారణ సమావేశం జరిగింది. తొలుత ఇటీవల నూతనంగా ఎన్నికైన స్థాయీ సంఘ సభ్యులు (ఆరుగురు) మేయర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి వారందరినీ అభినందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ చిత్త శుద్ధితో పని చేయాలని సూచించారు. అనంతరం జరిగిన ఈ స్థాయీ సంఘ సాధారణ సమావేశంలో మొత్తం 24 అంశాలు చర్చకురాగా వాటిల్లో 19 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. అదేవిధంగా ఒక అంశం ధ్రువీకరించబడగా మరో మూడు అంశాలను వాయిదా వేశారు. ఒక అంశాన్ని రికార్డ్ చేశారు.



స్థాయీ సంఘ సమావేశంలో చర్చిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, సభ్యులు

కల్యాణమండపం నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ఎఫెక్ట్..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): స్థానిక 57వ డివిజన్ ప్రజల చిరకాల కోరికైన కల్యాణ మండపం ఏర్పాటు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ డివిజన్‌లో ప్రభుత్వ కల్యాణ మండపం లేకపోవడంతో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన సాక్షి పత్రికలో వెలువడిన 'నడిరోడ్లే.. వేడుకలకు వేదికలు' అనే కథనానికి పాలకులు, ఉన్నతాధికారులు స్పందించారు. రూ. కోటీ 31 లక్షల వ్యయంతో న్యూఆర్‌ఆర్‌పేటలో కల్యాణమండపం నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ఈ కల్యాణమండప శంకుస్థాపన పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ ఇసరపు దేవి, నాగవంశం రాష్ట్ర సాధికారక కన్వీనర్ రమణారావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ రాకతో రద్దయిన తీర్మానం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేటర్ ఇసరపు దేవి ఈ డివిజన్‌లో కల్యాణమండపం ఏర్పాటు అంశాన్ని కౌన్సిల్ ముందు పెట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పట్లో అది రద్దయింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని పక్కన పెట్టేసింది. ఇక్కడి ప్రజల అవస్థలను కళ్లకు కట్టినట్లు 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురణ కావడంతో ఎమ్మెల్యే బొండా ఉమా, కార్పొరేషన్ కమిషనర్ స్పందించి, కళ్యాణమండపం ఏర్పాటుకు రంగం సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



కల్యాణమండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఉమా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సబ్ స్టేషన్ మ్యూజిక్ కాలేజీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. దుర్గాపురం, బావాజీపేట, రామకోటిమైదానం, శారద కాలేజీ లైన్, పి.వి.రాజు స్ట్రీట్, నోరి హాస్పిటల్ ఏరియా, రాజగోపాలాచారి మార్కెట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వ్యాయామ విద్య విభాగాధిపతికి రెండు స్వర్ణ పతకాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ డీ యుగంధర్ 9వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్–డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్ 2025, 2వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్–డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్ 2025లో రెండు స్వర్ణ పతకాలు గెలిచి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారు. కృష్ణా జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ అసోసియేషన్, బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్తంగా ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణపతకాలను యుగంధర్ కైవసం చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ కళాశాల అధ్యాపకులు యుగంధర్‌ను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా గోదాదేవి జన్మదిన వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో సోమవారం శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యంలో గోదాదేవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమాన్వితమైన గోదాదేవి అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరి శుభం జరుగుతుందన్నారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యంలో పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ), ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఐఓ ఆధ్వర్యంలో పాలస్తీనాకు మద్దతుగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం పాలస్తీనాకు మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గాజాలో జరుగుతున్న సామూహిక హత్యలపై, ఇజ్రాయెల్ దాడులను అధికారికంగా ఖండించాలన్నారు. ఇజ్రాయెల్‌తో రక్షణ, వాణిజ్య ఒప్పందాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని వెంటనే ఆపే ప్రయత్నం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అమిర్ ఫహద్ మాట్లాడుతూ పాలస్తీనాకు సంఘీభావంగా ఆగస్టు 3వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏపీసీఆర్ అధ్యక్షుడు పిచ్చుక శ్రీనివాస్, జమాతే ఇస్లామి హింద్ కార్యదర్శి మహమ్మద్ కరీముద్దీన్, దివికుమార్, గుట్ట రోహిత్, అబ్దుల్ రఖీబ్, మతీన్, ముషాహిద్ బేగ్, అక్బర్ బాషా పాల్గొన్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్త మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని కదులూరి దుర్గ ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు 17 సంవత్సరాల క్రితం కదులూరి శ్రీనివాసరావుతో దుర్గకు వివాహం జరిగింది. గత ఏడాది నుంచి ఫిర్యాది భర్త వేరే మహిళతో ఉంటూ ఇబ్బంది పెడుతున్నాడని దుర్గ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స కన్నా నివారణ మేలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చికిత్స కన్నా నివారణ మేలు అని .. వ్యాధి వచ్చిన తరువాత చికిత్స తీసుకోవటం కంటే ముందుగానే వ్యాక్సిన్ వేయించుకోవటం మంచిదని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో సోమవారం వరల్డ్ హెపటైటిస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 2030లోపు హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంపై విద్యార్థులకు వివరించారు. అధ్యాపకుడు నాగేశ్వరరావు టీకాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అధ్యాపకురాలు సయ్యద్ వాజిహా తహసీన్ కాలేయం ఎలా జీవరసాయన శక్తి కేంద్రంగా పనిచేస్తుందో వివరించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

పాయకాపురం(విజయవాడరూరల్): వీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు కండ్రిక, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్‌లో సోమవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బృందం దాడులు నిర్వహించింది. 120 మైక్రాన్స్ కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజల్ గ్లాసులను సీజ్ చేసి షాపులకు పెనాల్టీ విధించారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సూర్యనారాయణ, శివకుమార్, గోపిరాజు, వందనం బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్త్ ఏసీపీ డాక్టర్ స్రవంతి రాయ్ సూచించారు. నున్న పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో యువతను మత్తు పదార్థాల దుర్వినియోగం–సోషల్ మీడియా బానిసత్వం నుంచి రక్షించేందుకు పైపులరోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా మత్తు పదార్థాల జోలికి వెళ్ల వద్దన్నారు. సోషల్ మీడియాకు పిల్లలు బానిసలవుతూ సైబర్ నేరాలకు గురవుతున్నారని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. నున్న సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు కల్గి ఉన్నా, వాటిని వాడినా లేక విక్రయించినా.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ నాగేశ్వరరావు, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరి పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్బీపేట(విజయవాడతూర్పు): చంద్రబాబు అంటేనే మోసం.. దగా అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు అన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం 24వ డివిజన్‌లో జరిగింది. శిఖామణిసెంటర్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ గ్రంథాలయంలో నిర్వహించిన ఈ సభలో ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అవి అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసగిస్తున్నారో వివరించారు. ఎన్నికల ముందు ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో బాండ్లు ఇచ్చి.. ఇప్పుడు అమలు చేయకుండా మోసగించిన విధానాన్ని ప్రజలకు వివరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల్లో వయస్సు 18 నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు అది అమలు చేయాలంటే రాష్ట్రాన్నే అమ్మాలంటున్నారని, అంటే ఇవ్వలేమని చెప్పకనే చెబుతున్నారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. పేదలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారన్నారు. ఆరోగ్య ఆసరా పథకాన్ని ఎత్తేశారన్నారు. ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేస్తూ, వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుక్కల అనిత, పార్టీ నేతలు కొమ్ము చంటి, కుక్కల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్నా చౌక్ వద్ద ధర్నా

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని రూ. 600 కోట్ల విలువైన పాత బస్టాండ్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం 'లులూ సంస్థకు' కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు గాంధీనగర్ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ వద్ద నిరసన ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత విలువైన స్థలాన్ని ఇష్టారాజ్యంగా కేటాయించటం దారుణమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నాకు నియోజకవర్గ కార్పొరేటర్లు, అనుబంధం విభాగాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి సబ్ కోటా ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం డిమాండ్ చేసింది. సోమవారం ధర్నా చౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒక రోజు నిరాహార దీక్ష జరిగింది. మహిళా విభాగ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ, గౌరవాధ్యక్షురాలు వావిలాల సరళాదేవి మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలన్నారు. ఇందుకోసం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరణ చేయాలని కోరారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత చట్టసభలలో 33 శాతంతో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆమోదించిందన్నారు. అయితే బీసీ మహిళలకు సబ్–కోటా కేటాయించకుండానే చట్టం చేసిందన్నారు. కేసన శంకరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల పార్లమెంటు సమావేశంలోనే చట్టసభలలో ఓబీసీల రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్ చట్టానికి ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ సవరణ చేయాలన్నారు.



విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన దీక్షలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ధర్మస్థలి హత్యోదంత ఘటనలపై దర్యాప్తు వేగవంతం చేయాలి

మహిళా సంఘాల ఐక్య వేదిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధర్మస్థల హత్యోదంత ఘటనల్లో సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య అక్కినేని వనజ మాట్లాడుతూ ధర్మస్థల హత్యోందత ఘటనలు తీవ్ర భయాందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ ఘటనలపై దర్యాప్తు మందకొడిగా సాగుతోందన్నారు. బాధితులకు సరైన న్యాయం జరుగుతుందా అనే అనుమానం కలుగుతోందన్నారు. 1983 నుంచి ఇప్పటి వరకు అదే ప్రాంతంలో అనేక మంది మహిళలు, యువతులు, బాలికలు మిస్ అయిన సంఘటనలున్నాయన్నారు. పలుమార్లు కేసులు దర్యాప్తులు, చట్టసభలలో చర్చలు జరిగాయని తెలిపారు. ఏది సక్రమంగా విచారణ జరగలేదని, ఆర్థిక బలం, అధికార బలంతో వ్యవస్థ లోని లోపాలను ఆధారంగా చేసుకుని దోషులు తప్పించుకున్నారన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సిట్ బృందం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గా భవాని మాట్లాడుతూ ఈ ఘటనలో సమగ్ర దర్యాప్తునకు న్యాయవాదులు, ప్రజలు ఆందోళన చేసిన తరువాత మాత్రమే సిట్ వేశారన్నారు. దానికి కూడా కాలపరిమితిని విధించలేదన్నారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు ఆర్.గంగాభవాని, ఐద్వా నాయకురాలు ఝూన్సీ, మహిళా సంఘాల ప్రతినిధులు పద్మ, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, బంకా ఝూన్సీలక్ష్మి, కె.శైలజ, డి.పుష్పావతి, మూలి ఇందిర, చింతాడ పార్వతి, నిలాపు భాగ్యలక్ష్మి, బి.శాంత, నక్కా రాజ్యలక్ష్మి, మేకా పార్వతి, నాగుర్ బి, అనిత, రాణి, భువన సుందరీ, షకీలా తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న మహిళా సంఘాల నేతలు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానది కరకట్ట ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, కార్యవర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ నగరంలోని కృష్ణా కరకట్ట ప్రాంతంలోని రణదివే నగర్, తారక రామానగర్, భూపేష్ గుప్తా నగర్, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ కరకట్టపై ఐదు దశాబ్దాల పైబడి ప్రజల ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. వరదల సమయంలో తీవ్రంగా నష్టపోయినా, ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అక్కడే నివాసం ఉంటున్నారన్నారు. ప్రజా పోరాటాల ఫలితంగా కరకట్టపై రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగిందన్నారు. రక్షణ గోడ నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రదేశంలో వరద వచ్చే అవకాశం లేదన్నారు. 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఏం అడ్డంకి వచ్చింది? అని ప్రశ్నించారు. సాకులు చెప్పకుండా ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యేను ప్రజలు ప్రశ్నించినా స్పందించడం లేదన్నారు. కరకట్ట పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం స్పందించి పట్టాలు ఇచ్చేంత వరకు పోరాడుతామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కరకట్ట ప్రాంత వాసులు, సీపీఎం నాయకులు

విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర మండిపడ్డారు. సంక్షేమ వసతి గృహాల సమస్యలపై హాస్టల్ సందర్శనలో భాగంగా సోమవారం పాయకాపురం, ప్రకాష్‌నగర్లోని బాలుర కాలేజీ ఎస్సీ హాస్టల్‌ను విద్యార్థి విభాగం ప్రతినిధులు, ఎస్సీ సెల్ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పాలిష్ పట్టిన బియ్యాన్ని తనిఖీ చేశారు. బియ్యంలో పురుగులు ఉండడాన్ని గుర్తించారు. వంట గదిలో వంట తయారీని, టాయిలెట్స్, సదుపాయాలను వారు పరిశీలించారు. అనంతరం రవిచంద్ర విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని హాస్టల్స్‌ను పరిశీలించి అక్కడున్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం అవుతున్నా హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్స్, డైట్ చార్జిలను ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెస్, కాస్మోటిక్ చార్జీలను హైస్కూల్ విద్యార్థులకు రూ.850 నుంచి రూ.1,400, కాలేజి విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ.1,600 పెంచారన్నారు. రాష్ట్రంలోని హాస్టల్స్‌లోని విద్యార్థులను విద్యార్థి విభాగం నాయకులు కలిసి వారి సమస్యలను ఆగస్టు ఒకటో తేదీ నాటికి ఆయా జిల్లా కలెక్టర్లకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ అధికారులకు తెలియజేస్తామన్నారు. విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ జె.కోమలిసాయి, సెంట్రల్ నియోజకవర్గ ప్రెసిడెంట్ సురేష్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, సెంట్రల్ నియోజకవర్గం మహిళా కార్యదర్శి తోపుల వరలక్ష్మీ, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు శ్యామ్‌బాబు, ఎస్సీ సెల్ నాయకులు సువర్ణ రాజు, స్థానిక నాయకులు అలంపూర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి విభాగం నాయకులు